
ANN తెలుగు
Follow: @mahaadaily
REGISTERED NUMBER: APTEL/2014/58382
04-12-2025
మహా పత్రిక
తిరుపతి, హైదరాబాద్
సంపుటి- 22 సంచిక- 345 పేజీలు-04 వెల-రూ.6
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD
గురువారం
WWW.EPAPER.MAHAADAILY.COM



# కాంగ్రెస్ ప్రభుత్వం మంచి ప్రజాపాలన అందిస్తుంది

**సీఎం ఆదిలాబాద్ పర్యటనను విజయవంతం చేయండి**

**రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి పిలుపు**

**ఆదిలాబాద్, మహా :** గత పదేళ్లలో బీఆర్ ఎస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోలేదని తమ ప్రభుత్వం రైతు భరోసా, రుణమాఫీ, సన్నబియ్యం , నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, ఉచిత కరెంట్ , 500లకు గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సుప్రయాణం ఇలా ఎన్నొ సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్ల ను ఆయన కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు.అనంతరం మీడియాతో మాట్లాడారు. రేపు గురువారం సీయం ఆదిలాబాతద్ పర్యట నను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.రెండేళ్ళ ప్రజా పాలన లో ప్రభుత్వం చేసిన మంచి పనులకు గుర్తుగా ప్రజా పాలన విజయోత్సవాలు జరుపుకుంటున్నామన్నారు.

మిగతా 2లో

## టాప్ న్యూస్

### ఛత్తీస్‌గఢ్‌లో ఎన్ కౌంటర్

- 12 మంది నక్సల్స్.. ముగ్గురు జవాన్లు మృతి
- స్వాధీనమైన ఆయుధాలు, పేలుడు పదార్థాలు
- ఇంకా భద్రతా దళాల ఆధీనంలో ఘటనా స్థలం



02

### పవన్ కల్యాణ్ జాగ్రత్త

- ఆలోచించి మాట్లాడు
- హెచ్చరించిన కవిత



02

### హిందువులకు బేషరతుగా క్షమాపణలు చెప్పు

- సీఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి డిమాండ్



02

# త్వరలో మరో 40వేల ఉద్యోగాలు భర్తీ చేస్తాం

**ఇప్పటికే 60వేల ఉద్యోగాలిచ్చాం.. ఆరుమాసాల్లో లక్షకు చేరుతాం**

ఆడబిడ్డలను యాజమానులను చేశాం.. వ్యవసాయం పండుగ చేశాం

కిరికిరిగాళ్లను పక్కన పెట్టండి.. ప్రభుత్వంతో ఉండే వారిని ఎన్నుకోండి

హుస్నాబాద్ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హుస్నాబాద్, మహా :** త్వరలో మరో 40,000 ఉద్యోగాల భర్తీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలో రూ.262 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ముఖ్యంత్రి శంకుస్థాపన చేశారు. రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర, శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హుస్నాబాద్‌లో నిర్వహించిన ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ హుస్నాబాద్ నుంచే బహుజన దండు కట్టారని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమం ఈ ప్రాంతం నుంచి ఉవ్వెత్తున ఎగసిపడిందని గుర్తు చేశారు. కరీంనగర్‌లో ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకే సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని అన్నారు. శ్రీకాంతాచారి స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే



60,000 ఉద్యోగాలు ఇచ్చామని, ప్రజాపాలన రెండున్నరేళ్లు పూర్తయ్యేలోగా లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు.

మిగతా 2లో





# పదేళ్లు నేనే సీఎం

- ఉత్తరాదిన నన్ను బీజేపీ పాపులర్ చేస్తున్నందుకు సంతోషం
- జూబ్లీహిల్స్ డిపాజిట్ కోల్పోవడం వల్లే బీజేపీ రాద్ధాంతం
- ప్రధాని మోదీతో భేటీ అనంతరం సీఎం రేవంత్ రెడ్డి చిట్ చాట

**ఢిల్లీ, మహా:** తెలంగాణలో రెండు టర్మ్ లు నా నాయకత్వంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని, రెండు టర్మ్‌లు తాను సీఎంగా ఉండడం పక్కాఅని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు.

మిగతా 3లో

### తెలంగాణ మోడల్‌కు సహకరించండి

**ప్రధాని మోదీకి సీఎం రేవంత్ విజ్ఞప్తి**

- హైదరాబాద్ గ్లోబల్ సమ్మిట్ కు ఆహ్వానం
- రేవంత్ ప్రయత్నాన్ని అభినందించిన ప్రధాని
- కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, రాజ్ నాథ్ □తో భేటీ
- రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో భేటీ.. ఫ్యూచర్ సిటీకి ఆహ్వానం

03




# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్ కౌంటర్

## 12 మంది నక్సల్స్ .. ముగ్గురు జవాన్లు మృతి

- స్వాధీనమైన ఆయుధాలు, పేలుడు పదార్థాలు
- ఇంకా భద్రతా దళాల అధీనంలో ఘటనా స్థలం



**ఛత్తీస్‌గఢ్,మహా:** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో బుధవారం జరిగిన ఓ భీకర పోరాటం మావోయిస్టు పార్టీకి మరో తీవ్రమైన నష్టాన్ని కలిగించింది. భద్రతా దళాలు, నక్సలైట్ల మధ్య జరిగిన ఈ ఎదురుకాల్పుల్లో ఏకంగా 12 మంది మావోయిస్టులు మృతి చెందారు. అయితే, దురదృష్టవశాత్తు దేశ సేవలో ఉన్న ముగ్గురు డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ జవాన్లు తమ ప్రాణాలను కోల్పోయారు. మరో ఇద్దరు డీఆర్‌జీ జవాన్లు గాయపడగా, వారిని తక్షణ చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. పోలీసు ఉన్నతాధికారుల సమాచారం ప్రకారం, బీజాపూర్ పరిధిలోని అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు జరిపిన గాలింపు చర్యల సందర్భంగా ఈ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. నక్సలైట్లు భద్రతా దళాలపై కాల్పులు జరపగా, జవాన్లు ధీటుగా బదులిచ్చారు. ఘటనా స్థలం నుంచి ఐదుగురు నక్సలైట్ల మృతదేహాలను ఇప్పటివరకు స్వాధీనం చేసుకోగా, మిగిలిన మృతదేహాల కోసం గాలింపు కొనసాగుతోంది. ఘర్షణ జరిగిన ప్రాంతం నుంచి భారీగా పేలుడు పదార్థాలు, అత్యాధునిక ఆయుధాలను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. 2026 మార్చి నాటికి మావోయిస్టు పార్టీని అంతం చేయాలనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యంతో మొదలైన ఆపరేషన్ కగార్ ద్వారా దండకారణ్యంలో మావోయిస్టు ఉద్యమం ఇప్పుడు తుది దశకు చేరుకున్నట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు. అగ్ర నాయకత్వంలో వరుసగా ఏర్పడిన లోటు నక్సల్స్ క్యాడర్‌ను కుదిపేసింది. గత కొద్ది నెలలుగా ఉద్యమాన్ని ముందుండి నడిపించిన నంబాల కేశవరావుతో పాటు, మావోయిస్టు పార్టీ అత్యంత కీలక నేతలలో ఒకరైన మడవి హిడ్మాను సైతం భద్రతా బలగాలు ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్లలో అంతం చేశాయి. ఇది మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బగా పరిగణించబడుతోంది. అగ్రనేతల మరణాలతో పాటు, మల్లోజుల వేణుగోపాల్, ఆశన్న వంటి సీనియర్ నాయకులు లొంగిపోవడం, మరొక కీలక నేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ పోలీసుల అదుపులో ఉన్నారనే వార్తలు రావడం మావోయిస్టు పార్టీ నాయకత్వాన్ని పూర్తిగా నాశనం చేస్తున్నాయి. ఒకప్పుడు దండకారణ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమాంతరంగా జనతా సర్కార్ నడిపిన మావోయిస్ట్ పార్టీ, భద్రతా దళాల దూకుడు వ్యూహాలతో, వరుస ఎదురుదెబ్బలతో కుదేలైపోయింది. ఈ తాజా ఎన్‌కౌంటర్, ఆపరేషన్ కగార్ విజయానికి మరో మైలురాయిగా నిలుస్తుందని కేంద్ర హోంశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

## చిత్రపురి కాలనీ అక్రమాల కేసులో

# 15 మందిని బాధ్యులను చేస్తూ ఫైనల్ రిపోర్ట్

- **ఫైనల్ రిపోర్టులో కొమర వెంకటేష్, వినోద్ బాల, కాదంబరి కిరణ్, తమ్మారెడ్డి భరద్వాజ్**
- **2005 నుంచి 2020 వరకూ జరిగిన అవకతవలపై విచారణ**
- **రూ.43.84 కోట్లు కాజేసిన పెద్దలు**





**హైదరాబాద్ - మహా:** మణికొండలోని చిత్రపురి కాలనీ అక్రమాల కేసులో విచారణ పూర్తయింది. చిత్రపురి కాలనీ హౌసింగ్ సొసైటీలో ప్లాట్ల కేటాయింపులో 2005 నుంచి 2020 వరకూ జరిగిన అవకతవలపై కమిటీ విచారణ జరిపింది. నవంబర్ 27న తెలంగాణ ప్రభుత్వానికి నివేదిక అందించింది. అక్రమాలకు సంబంధించి ఫైనల్ రిపోర్టులో 15 మందిని బాధ్యులుగా చేర్చింది. పాత, ప్రస్తుత కమిటీ సభ్యుల పాత్ర ఉందంటూ నివేదికలో కమిటీ పేర్కొంది. ఫైనల్ రిపోర్టులో పలువురు సినీ పెద్దల పేర్లు ఉన్నాయి. గోల్కొండ కోఆపరేటివ్ సొసైటీస్ డిప్యూటీ రిజిస్ట్రార్ తెలంగాణ ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. పలువురు సినీ పెద్దలు కమిటీలో ఉంటూ నిధులు కాజేశారని రిపోర్టులో పేర్కొన్నారు. పలువురు సినీ పెద్దల పాత్రపై రిపోర్టులో కీలక అంశాలను డిప్యూటీ రిజిస్ట్రార్ ప్రస్తావించారు. రూ.43.78 కోట్లు రికవరీ చేయాలని రిపోర్టులో పేర్కొన్నారు. అదనంగా 18 శాతం చెల్లించాలని ఆదేశాలను జారీ చేశారు. నివేదికలో తమ్మారెడ్డి భరద్వాజ్, పరుచూరి వెంకటేశ్వరరావు, వినోద్ బాల, కొమర వెంకటేష్, కాదంబరి కిరణ్, బత్తుల రఘు, దేవినేని బ్రహ్మానంద, వల్లభనేని అనిల్‌తో పాటు పలువురి పేర్లు ఉన్నాయి. డిప్యూటీ రిజిస్ట్రార్ 15 మందికి నివేదిక కాపీని పంపారు.


# కోడికి మస్తు డిమాండ్

## పంచాయతీ ఎన్నికల ఎఫెక్ట్

- నాలుగు రోజుల్లో రూ.240 వరకు పెరిగిన చికెన్ ధర
- రాష్ట్రంలో తొలివిడత చికెన్ ఖర్చే 30 కోట్లు



**హైదరాబాద్, మహా:** పంచాయతీ ఎన్నికల పుణ్యమాని కోడి ధర పైపైకి ఎగబాకుతోంది. ఎన్నికల ప్రక్రియకు ముందు గ్రామాల్లో కిలో చికెన్ రూ.200 నుంచి రూ.220 వరకు ఉండేది. గత నాలుగైదు రోజులుగా రూ.240 వరకు పెరిగింది. అక్కడే చికెన్ వండిస్తే రూ.330 వరకు తీసుకుంటున్నారు. రోజూ ఎంత మంది ఓటర్లకు, ఎంత పంపిణీ చేయాలో ఎన్నికలలో నిల్చునే అభ్యర్థులు లెక్కలేసుకుంటున్నారు. ఈ మేరకు మాంసం వ్యాపారులతో ముందే ఒప్పందాలు చోటుచేసుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తొలి విడతలో ఎన్నికలు జరగనున్న పంచాయతీల్లో వేల సంఖ్యలో చికెన్ దుకాణాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో ఓటర్ల సంఖ్యను చూసి వచ్చే 8 రోజుల్లో రోజుకు ఒక్కో దుకాణంలో 100 నుంచి 400 కిలోల చికెన్ విక్రయించనున్నారు. రాష్ట్రంలో ఇలా అభ్యర్థులు రోజూ మాంసం ఖర్చులే రూ.3.50 కోట్లు భరించాల్సి ఉంటుంది. 8 రోజుల్లో రూ.25 కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకు కేవలం చికెన్ పైనే వ్యయం చేయనున్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వం మంచి ప్రజాపాలన అందిస్తుంది

**సీఎం ఆదిలాబాద్ పర్యటనను విజయవంతం చేయండి**

**రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి పిలుపు**

**(మొదటిపేజీ తరువాయి)**

ఆదిలాబాద్ మున్సిపల్ అభివృద్ధికి 18కోట్లు ఇచ్చినట్టు తెలిపారు.ఇంకా 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేసామన్నారు.కొత్త రేషన్ కార్డులు ఇచ్చామని తెలిపారు.గత ప్రభుత్వం దొడ్డు బియ్య మిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తుందన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇండ్లతో ప్రభుత్వం సొంతింటి కల నిజం చేసిందన్నారు. ఆదిలాబాద్ అభివృద్ధికి మరిన్ని అవసరాలు రెండోదశలో తీర్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు.విద్యుత్ సబ్ స్టేషన్లు కూడా తొందరల్లోనే పూర్తవుతున్నాయన్నారు. ఎన్నికల నియమావళి కారణంగా ఇంకా కొన్ని అభివృద్ధి పనులను వాయిదా వేసుకున్నామన్నారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇస్తూ వారి ఆర్థిక పురోగతికి ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. డిసెంబర్ 8,9 తేదీలలో హైదరాబాల్ లో సదస్సు జరుతుందన్నారు. యువతకు అనేక రంగాల్లో శిక్షణ అందిస్తామన్నారు.ఇలా కాంగ్రెస్ ప్రభుత్వం మంచి ప్రజా పాలన కొనసాగిస్తుందన్నారు. అనంతరం అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ సీయం రేవంత్ రెడ్డి కు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్ ,డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్ , ఆదిలాబాద్ ,బోథ్ , ఆసిఫాబాద్ అసెంబ్లీ ఇంచార్జిలు కంది శ్రీనివాస రెడ్డి , ఆడె గజేందర్,శ్యాంనాయక్ , డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ ఎంపీ సోయం బాపూరావు,మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, గండ్రత్ సుజాత, అల్లూరి సంజీవ్ రెడ్డి, బోరంచు శ్రీకాంత్ రెడ్డి,లోక ప్రవీణ్ రెడ్డి , మునిగెల నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# అజేయమైన అభేద్య దుర్గం

**పుతిన్ పర్యటనకు ఐదంచెల హైటెక్ భద్రతా వలయం!**



**న్యూ ఢిల్లీ, మహా:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటన కేవలం దౌత్యపరంగానే కాక, భద్రతాపరంగానూ సరికొత్త ప్రమాణాలను నెలకొల్పింది. ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన రక్షణ వ్యవస్థల్లో ఒకటిగా పరిగణించబడే రష్యన్ ప్రెసిడెన్షియల్ సెక్యూరిటీతో కలిసి, భారతదేశ అత్యున్నత భద్రతా దళాలు ఢిల్లీని అక్షరాలా ఒక అభేద్యమైన దుర్గంగా మార్చేశాయి. ఆయన రాక సందర్భంగా రాజధానిలో ఐదంచెల భద్రతా వలయాన్ని ప్లాన్ చేశారు, దీనిలో ప్రతి పొర అత్యున్నత స్థాయి శిక్షణ, అధునాతన సాంకేతికతతో కూడినది.

**ఎలైట్ కమాండోలు, స్నిపర్ల కనుసన్నల్లో రాజధాని**

యాక్షన్‌ప్యాక్డ్ ఈ పర్యటనకు భద్రతను పటిష్టం చేసేందుకు, నాలుగు డజన్లకు పైగా రష్యన్ భద్రతా సిబ్బంది, అధ్యక్షుడి కంటే ముందుగానే ఢిల్లీ చేరుకున్నారు. ఈ సిబ్బంది భారతదేశ నేషనల్ సెక్యూరిటీ గార్డ్ కమాండోలు, ఢిల్లీ పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి పనిచేస్తున్నారు. వీరంతా కలిసి పుతిన్ ప్రయాణించే ప్రతి మార్గాన్ని, ప్రతి మూలను క్షుణ్ణంగా పరిశుభ్రం చేస్తున్నారు. అత్యంత కీలకమైన భద్రతా వలయాలలో రష్యా అధ్యక్ష భద్రతా సర్వీస్ సిబ్బందితో పాటు, ఎన్ ఎస్ జి నుండి అగ్రశ్రేణి స్నిపర్లు వ్యూహాత్మక పాయింట్ల వద్ద స్థానాలను ఆక్రమించారు. ఈ స్నిపర్లు అధ్యక్షుడి కదలిక మార్గాన్ని పూర్తిస్థాయిలో కవర్ చేస్తూ, ఏ చిన్న అసాధారణ కదలికనైనా కనిపెట్టేలా అత్యంత అప్రమత్తంగా ఉన్నారు. పుతిన్ భద్రత కోసం సాంకేతికతను భారీగా వినియోగిస్తున్నారు. ఇది కేవలం మానవ శక్తితో కూడిన భద్రతా వలయం కాదు; అత్యాధునిక సాంకేతికతతో కూడిన హైటెక్ నిఘా వ్యవస్థ. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డ్రోన్‌లు ఎల్లప్పుడూ ఆకాశం నుండి అధ్యక్షుడి దళాల కదలికలపై నిఘా ఉంచుతాయి. ఈ డ్రోన్‌లు నేరుగా కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించబడి, సెకనుకు సెకనుకు సమాచారాన్ని అందిస్తాయి. నేలపైన, అత్యంత శక్తిమంతమైన జామర్‌లు అధ్యక్షుడి కాన్వాయ్ చుట్టూ ఎలాంటి రిమోట్ ప్రేరేపిత పరికరాలు పనిచేయకుండా ఒక సురక్షితమైన బుడగను సృష్టిస్తున్నాయి. ఈ భారీ సాంకేతిక విస్తరణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , పర్యవేక్షణ ,ముఖ గుర్తింపు కెమెరాలు కూడా భాగం. ఇవి వేలాది మంది జనంలో అనుమానాస్పద వ్యక్తులను , ముప్పును గుర్తించేందుకు ఉపయోగపడుతున్నాయి. పుతిన్ బస చేసే హోటల్ ప్రాంతాన్ని కూడా పూర్తిగా శానిటైజ్ చేసి, దళాల నియంత్రణలోకి తీసుకున్నారు. రష్యన్ భద్రతా అధికారులు ఆకస్మిక గమ్యస్థానాల జాబితాను కూడా తయారు చేసి, ఆ ప్రాంతాలను సైతం స్కాన్ చేస్తున్నారు. అత్యంత ముఖ్యంగా, రష్యా అధ్యక్షుడు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో భేటీ అయ్యే సమయంలో, భద్రత మరింత పటిష్టం అవుతుంది. ఈ అంతర్గత భద్రతా వలయంలో ప్రధానమంత్రికి రక్షణగా ఉండే స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ కమాండోలు కూడా భాగస్వాములవుతారు. ఈ విధంగా, రష్యా, భారత అత్యున్నత భద్రతా విభాగాల మధ్య అద్భుతమైన సమన్వయంతో, పుతిన్ పర్యటనలో ఆయన భద్రత విషయంలో ఎలాంటి చిన్న లోపానికి కూడా తావు లేకుండా చూసుకుంటున్నారు.

## త్వరలో మరో 40 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తాం

**(మొదటిపేజీ తరువాయి)**

కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఎస్ఆర్ఎస్పీ ఎలా ఉందో? భారత రాష్ట్ర సమితి కట్టిన కాళేశ్వరం ఎలా ఉందో ప్రజలు ఆలోచించాలని సీఎం సూచించారు. దేశంలో అత్యధికంగా వరిని పండించేది మన రాష్ట్రంలోనేనని గుర్తు చేశారు. వ్యవసాయం అంటే దండగ కాదని, పండగ అని చేసి చూపించింది తమ ప్రభుత్వమేనని అన్నారు. రాష్ట్రంలో రైతుల కోసం రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు పెట్టామని, తెలంగాణ రాష్ట్రంలో వందలాది బస్సులకు ఆడబిడ్డలు యజమానులు అయ్యారని అన్నారు. 3.10 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, రూ.22,500 కోట్లు పేదల ఇళ్ల కోసం ఖర్చు చేస్తున్నాని తెలిరారు. సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్లలో మొదలు పెట్టిన ప్రాజెక్టులు అన్నీ పూర్తయ్యాయని అన్నారు. కానీ, హుస్నాబాద్ నియోజకవర్గంలోని గౌరెల్లి ప్రాజెక్టు ఇంకా పూర్తి కాలేదని తెలిపారు. గత పాలకుల మాదిరిగా హుస్నాబాద్‌ను నిర్లక్ష్యం చెయ్యమని, త్వరలో గౌరెల్లి ప్రాజెక్టు పూర్తి చేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కిరికిరిగాళ్ళను పక్కనపెట్టి, మంత్రులు, ప్రభుత్వంతో ఉండే మంచివారినే ఎన్నుకోవాలని సీఎం సూచించారు. గ్రామాల అభివృద్ధి కోసం పని చేసేవారినే సర్పంచ్‌లుగా గెలిపించుకోవాలన్నారు.

# భూ సమస్యలపై త్వరలో ట్రిబ్యునల్స్

- ఒకే గొడుగు కిందకు ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్
- హిల్ట్ పాలసీపై బీఆర్ఎస్ ద్వంద్వవైఖరి
- నాటి మున్సిపల్ మంత్రి ముడుపులు తీసుకొని ల్యాండ్ కన్వర్షన్ చేశారు
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, మహా :** రెండేళ్లలో రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలలో ప్రజల సౌలభ్యం కోసం విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో మీడియాతో మాట్లాడిన మంత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు జనవరి నెలాఖరుకల్లా రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల సమాచారంతో కూడిన సింగిల్ పేజీ డిజిటలైజేషన్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని, ధరణి పోర్టల్ ద్వారా వచ్చిన యాప్‌ను పూర్తిగా తొలగిస్తామని స్పష్టం చేశారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఎన్ఐసీ కసరత్తు చేస్తోందని వివరించారు. రాష్ట్రంలో నక్షాలు లేని 413 గ్రామాల్లో సరిహద్దుల, భూధార్ నెంబర్ల కేటాయింపు వంటి ప్రధాన అంశాలతో కూడిన సౌకర్యాలు కల్పించేందుకు ప్రయోగాత్మకంగా ఐదు గ్రామాలను ఎంపిక చేసి పని పూర్తి చేశామని, ఈ ఐదు గ్రామాలకు భూదార్ కార్డులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. మిగిలిన 408 గ్రామాల్లో పట్టణ ప్రాంతాలు మినహా 373 గ్రామాల్లో రెండవ విడత కింద సర్వే నిర్వహిస్తామన్నారు. మూడవ విడతగా అన్నిజిల్లాల్లోనూ జిల్లాకు 70 గ్రామాలను ఎంపిక చేసి భూదార్ కార్డులు అందిస్తామన్నారు. రాష్ట్రంలో ఇంత వరకు భూ సమస్యలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులలో అర్హత కలిగిన వాటిని జనవరి నెలాఖరు కల్లా పరిష్కరిస్తామని, ఆ తర్వాత ట్రిబ్యునల్‌స్‌ను ఏర్పాటు చేస్తామని మంత్రి ప్రకటించారు. అదేవిధంగా గత ప్రభుత్వ హయాం నుంచి చోటుచేసుకున్న అక్రమాలను వెలికితీసేందుకు గాను ఇంతవరకు రెండు జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్ జరుగుతోందని, వాటి ఫలితాలను గమనించి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసి అక్రమార్కుల భరతం పడతామన్నారు.

గడచిన పది సంవత్సరాలలో ఆనాటి పాలకుల స్వార్థపూరిత నిర్ణయాల వల్ల విధ్వంసమైన , కుప్పకూలిన రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేసిన ప్రజలకు చేరువ చేయడం జరిగిందన్నారు. భూ హక్కుల నుంచి రిజిస్ట్రేషన్ల వరకు ప్రతి పౌరుడికి మేలు జరిగేలా రెవెన్యూ వ్యవస్థలో సంస్కరణలు చేపట్టి అమలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ధరణి దరఖాస్తులకు మోక్షం కల్పించామని, అధికారం చేపట్టిన నాటికి 2.45 లక్షల ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఆ తర్వాత మరో నాలుగు లక్షల దరఖాస్తులు వచ్చాయని, వీటన్నింటినీ పరిష్కరించి ప్రజల సంతృప్తికి తొలి అడుగు వేశామన్నారు. ధరణి పోర్టల్ బాధ్యతలను ప్రభుత్వ సంస్థలకు అప్పగిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ధరణి పోర్టల్ నిర్వహణను టెరాసిస్ అనే విదేశీ సంస్థ నుంచి కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్ఐసికి అప్పగించడం జరిగిందని తెలిపారు. ఈ నిర్ణయం వల్ల తెలంగాణ రైతుల కోటీ 56 లక్షల ఎకరాల భూమి వివరాలు ఇప్పుడు సురక్షితమైన స్వదేశీ సంస్థ పరిధిలోకి వచ్చాయన్నారు. రాష్ట్రంలో రెవెన్యూ సేవలను సరళీకృతం చేయడం, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు దశల వారీగా భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించామన్నారు. అధికారంలోకి వస్తే గ్రామాలలో రెవెన్యూ వ్యవస్థను పునరుద్దరిస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకొని 10,954 రెవెన్యూ గ్రామాలను క్లస్టర్ వారీగా విభజించి జీపీవోలను నియమించడం జరిగిందని తెలిపారు. అవసరమైన యంత్రాంగాన్ని సమకూర్చుకునే ప్రక్రియలో ఖాళీగా ఉన్న సర్వేయర్ పోస్టులను భర్తీకి చర్యలు చేపట్టడంతో పాటు లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను కూడా అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, భూవిస్తీర్ణాన్ని బట్టి ప్రతి మండలానికి 4 నుంచి 6 గురు లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తున్నామని వెల్లడించారు. ఇప్పటికే దాదాపు నాలుగు వేల మందికి శిక్షణ ఇచ్చి లైసెన్స్‌లు జారీ చేశాం. డిసెంబర్ నెల నుంచి మరో మూడు వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చి గంటల తరబడి చెట్లకింద నిరీక్షించే పరిస్థితికి స్లాట్ బుకింగ్ ద్వారా తెరదించడం జరిగిందని, రాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మూడు దశల్లో ఈ స్లాట్ బుకింగ్‌ను ప్రవేశపెట్టడమేగాక ఆధార్ ఈ సంతకం కూడా అమలు చేసి ప్రజల డబ్బు, సమయం ఆదా చేశామన్నారు. ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా కార్పొరేట్ స్థాయిలో సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను దశల వారీగా నిర్మిస్తున్నామని చెప్పారు.

### నోరుందని మాట్లాడితే ఏలా..

**హిల్ట్ పాలసీపై స్పందిస్తూ నోరుందని ఏదిపడితే అది మాట్లాడుతున్నారు. ఆనాడు ప్రభుత్వంలో ఎమ్ఎయూడీ మంత్రిగా ఆయనకు నచ్చిన వారికి ముడుపులు చెల్లించిన వారికి ల్యాండ్ కన్వర్షన్ చేశారు. వారికి అవసరమైన ప్రాంతాలను రెసిడెన్షియల్ ప్రాంతాలుగా మార్చారు. మేం అలా చేయలేదు. పారదర్శకంగా క్యాబినెట్ తీర్మానం చేశాం. ఆనాడు కన్వర్షన్ చేసిన ల్యాండ్ వివరాల చిట్టాను విప్పుతామన్నారు.**




## పవన్ కల్యాణ్ జాగ్రత్త

**ఆలోచించి మాట్లాడు హెచ్చరించిన కవిత**

**హైదరాబాద్, మహా :** పవన్ కల్యాణ్ తెలంగాణ ప్రజల గురించి ఆలోచించి మాట్లాడాలని ఎమ్మెల్సీ కవిత అన్నారు. 'తెలంగాణ నాయకుల దిష్టి కళ్లతో కోనసీమ పాడైందని ఆయన అంటున్నారు. తెలంగాణ ప్రజలు ఏనాడు దిష్టి పెట్టలేదు. కోనసీమ మాదిరిగా తెలంగాణ కావాలనుకున్నాం. తెలంగాణ బిడ్డల మనసు చాలా గొప్పది. మేము పెద్దగా ఆలోచిస్తాం. మా రాష్ట్రం ఏర్పడి 12 ఏండ్లు అయ్యింది. ఎప్పుడు కూడా జై తెలంగాణ, జై ఆంధ్రా అనే అన్నాం. తెలంగాణ ఎంత బాగుందో.... ఆంధ్రా కూడా అంతే బాగుండాలని కోరుకున్నాం. ఆంధ్రకు ప్రత్యేక హోదా ఇవ్వాలని నేను పార్లమెంట్ లో మాట్లాడాను. పక్కోడు బాగుంటే మా కళ్లు మండవు. పక్కోనిది గుంజుకోవాలనుకునే వాళ్లం కాదు. మేము బాగుండాలనే కోరుకుంటాం. కానీ పక్కోడు చెడిపోవాలని అనుకోం. ఆనాడు మీరు సినిమానటుడిగా మాట్లాడారు. కానీ ఇప్పుడు మీరు ఏపీ డిప్యూటీ సీఎం. మీ మాటలను ఆంధ్రా ప్రజలకు ఆపాదిస్తారు. కనుక పవన్ కళ్యాణ్ జాగ్రత్తగా ఆలోచన చేసి మాట్లాడాలి. ' అని కవిత అన్నారు.

# సర్పంచ్ స్థానానికి... ఒకే కుటుంబంలో ఐదుగురు పోటీ

**ముగ్గురు అన్నదమ్ములు, అత్తా, కోడళ్లు పోటీ చేయడంతో రికార్డుల్లోకి హీరాపూర్**



**ఆదిలాబాద్, మహా :** ఇంద్రవెల్లి మండలం హీరాపూర్ గ్రామ పంచాయతీ రికార్డుల్లోకి ఎక్కింది. ఈ పంచాయితీ ఎస్ సి జనరల్ రిజర్వ్ అయ్యింది. దీంతో ఈ పంచాయితీ సర్పంచ్ పదవికి ఆడ, మగ ఇద్దరూ పోటీచేయవచ్చు. ఈ పంచాయతీ ఎన్నికల్లో హీరాపూర్ నుంచి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు, ఇద్దరు అత్తా కోడళ్లు నామినేషన్లు దాఖలు చేయడంతో వార్తల్లోకెక్కింది. ఈ ఎన్నికలు ఒకే కుటుంబంలో విభేధాలకు ఆజ్యం పోశాయి. ఇంద్రవెల్లి మండలం ఏమాయికుంటకు చెందిన తొడసం లక్ష్మి బాయి హీరాపూర్ గ్రామ సర్పంచ్ గా నామినేషన్ దాఖలు చేసింది. గతంలో ఆమె ఇదే స్థానం నుంచి సర్పంచ్ గా గెలిచింది. హీరాపూర్ గ్రామ పంచాయతీ ఎస్ సి జనరల్ కేటగిరి అయినా పోటీలేకుండానే లక్ష్మి బాయి గెలుస్తుందనే చాలామంది అనుకున్నారు. అయితే కొన్ని పంచాయతీల్లో జరిగే చిత్ర విచిత్రాలే హీరాపూర్ గ్రామ పంచాయతీలో కూడా జరిగింది. గ్రామంలో మహిళలెవరూ లక్ష్మి బాయికి పోటీగా నిల్చోకపోగా మద్దతుగా ఉన్నారు. అయితే ఎవరూ ఊహించని రీతిలో లక్ష్మి బాయి కోడలు తొడసం మహేశ్వరి అత్తకు పోటీగా సర్పంచ్ గా నామినేషన్ దాఖలు చేసి షాక్ ఇచ్చింది. లక్ష్మిబాయి గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని ఒకవైపు ప్రచారం చేసుకుంటుంటే మరోవైపు కోడలే నామినేషన్ దాఖలు చేస్తుందని ఎవరూ ఊహించలేదు. నామినేషన్ వేయటమే కాకుండా నిరక్షరాస్యులైన తన అత్తకన్నా తానే గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేయగలనని ప్రచారం కూడా మొదలు పెట్టేసింది. అత్తా, కోడళ్ళ వ్యవహారం ఇలాగ ఉండగా వారి కుటుంబంలోనే ముగ్గురు అన్నదమ్ములు కూడా సర్పంచ్ పదవికి నామినేషన్ దాఖలు చేయటంతో మొత్తం గ్రామానికే షాక్ తిన్నది. ఏమాయికుంటకు చెందిన జాదవ్ కిషన్, దేవ్ కబాయి దంపతులకు ప్రతాప్ సింగ్, కుబేర్ సింగ్, అనార్ సింగ్, రామ్ లఖన్ సింగ్ అనే నలుగురు కుమారులు ఉన్నారు. తండ్రి జాదవ్ కిషన్ ఒకసారి సర్పంచ్ గా, ముత్నూరు ఎంపీటీసీగా గెలిచాడు. తండ్రి మరణానంతరం నాలుగో కుమారుడు ఏమాయికుంట సర్పంచ్ గా పోటీ చేసి గెలిచాడు. ప్రస్తుతం ఎస్సీ జనరల్ కావటంతో నాలుగో కుమారుడు రామ్ లఖన్ సింగ్ సర్పంచ్ గా నామినేషన్ దాఖలు చేశాడు. అప్పటి వరకు రాజకీయాలకు దూరంగా ఉన్న సోదరులు జాదవ్ కుబేర్ సింగ్ , అనార్ సింగ్ కూడా సర్పంచ్ పదవికి నామినేషన్ దాఖలు చేశారు. ఒకే కుటుంబం నుంచి ముగ్గురు అన్నదమ్ములు, అత్తా కోడళ్లు నామినేషన్ వేయడంతో గ్రామస్థులు గందరగోళంలో పడిపోయారు. ఎవరికి ఓటు వేయాలో గ్రామస్తులు తేల్చుకోలేకపోతున్నారు. అందుకనే కుటుంబంలో ఐదుగురు పోటీపడటం కాకుండా ఎవరో ఒక్కరే పోటీలో ఉండాలని గ్రామస్తులు ఐదుగురికి స్పష్టంగా చెప్పారు. అయితే ఐదుగురిలో ఒక్కరు కూడా నామినేషన్ ఉపసంహరించుకోకపోవటంతో ఐదుగురు అభ్యర్థులూ పోటీలో ఉండటంతో హీరాపూర్ గ్రామ పంచాయతీ రికార్డుల్లో కెక్కింది.

## హిందువులకు బేషరతుగా క్షమాపణలు చెప్పు

**సీఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి డిమాండ్**

**ఢిల్లీ, మహా :** కాంగ్రెస్ పార్టీ హిందువులను హిందూ దేవుళ్లను అవమానించే కార్యచారణగా పెట్టుకున్నట్లుందని కిషన్ రెడ్డి విమర్శించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన.. హిల్ట్ పాలసీ కోసం వేసిన కమిటీ సచివాలయంలో ఉండి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిందని ఆరోపించారు. హిల్ట్ పాలసీని ఆదరాబాదరగా తీసుకురావడం వెనుక బడా వ్యాపారులకు లబ్ధి చేకూర్చే ప్రయత్నం ఉందని ఆరోపించారు. హిందూ దేవుళ్లను అవమానించే విధంగా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తాను ఖండిస్తున్నానన్నారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను కించపరిచేలా ఉన్నాయని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యలపై వెంటనే బేషరతుగా యావత్ హిందు సమాజానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు



## దివ్యంగులలో ఆత్మస్థైర్యాన్ని నింపుదాం

**కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జె సి రాజు**

**విజయనగరం జిల్లా,మహా:** దివ్యంగుల లో ఆత్మ స్తైర్యాన్ని పెంపొందించవలసిన భాద్యత సమాజం పై వున్నదని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జె సి రాజు అన్నారు.బుధవారం నాడు స్థానిక బొబ్బిలి కారుణ్య కార్యాలయంలో ప్రపంచ దివ్యంగుల దినోత్సవాన్ని కారుణ్య సంస్థ నిర్వహించింది. ఈ సందర్భంగా కారుణ్య సభ్యులు 16 మంది దివ్యంగుల ను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందించారు. కారుణ్య ఉపాధ్యక్షులు నాగురు రమేష్ మాట్లాడు తూ... సమాజం దివ్యంగుల యెడల జాలి చూపటం కంటే వారిలో ఆత్మ విశ్వాసాన్ని నింపాలన్నారు. దివ్యంగుల ప్రతినిధి రాంబాబు మాట్లాడుతూ దివ్యంగుల ను గుర్తించి సత్కరించి న కారుణ్య సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియచేసారు.కార్యక్రమంలో చిన్నారావు,సోమేశ్,కృష్ణ మోహన, రమేష్ చందు,రమేష్,దివ్యంగులు పాల్గొన్నారు.





# తెలంగాణ మోడల్‌కు సహకరించండి

**ప్రధాని మోదీకి సీఎం రేవంత్ విజ్ఞప్తి**

- హైదరాబాద్ గ్లోబల్ సమ్మిట్ కు ఆహ్వానం
- హైదరాబాద్ గ్లోబల్ సమ్మిట్ కు ఆహ్వానం రేవంత్ ప్రయత్నాన్ని అభినందించిన ప్రధాని
- హైదరాబాద్ గ్లోబల్ సమ్మిట్ కు ఆహ్వానం కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, రాజ్ నాథ్ సింగ్ □తో భేటీ
- హైదరాబాద్ గ్లోబల్ సమ్మిట్ కు ఆహ్వానం రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో భేటీ.. ఫ్యూచర్ సిటీకి ఆహ్వానం

**ఢిల్లీ, మహా:** తెలంగాణ ప్రభుత్వం డిసెంబర్ 8, 9 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో పాల్గొనాల్సిందిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్‌కు రావాలంటూ ప్రధాని మోదీని ప్రత్యేకంగా ఆహ్వానించారు. పార్లమెంట్‌లో ప్రధానితో జరిగిన ఈ భేటీలో సీఎంతో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించి ప్రత్యేకంగా ముద్రించిన ఆహ్వాన పత్రికను ప్రధానమంత్రికి అందజేశారు. కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, రాజ్ నాథ్ సింగ్ □తో భేటీ అయ్యారు. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీలను కలిసి ఫ్యూచర్ సిటీకి ఆహ్వానించారు. తన ప్రణాళికలు వివరించారు. ఈ సందర్భంగా ప్రధానికి అనేక అంశాలపై వినతిపత్రాలు అందజేయగా, సీఎం విజన్‌ను, తపనను ప్రధాని అభినందించారు. అవసరమైన సాయం కేంద్రం అందిస్తుందని హామీనిచ్చారు.

**ప్రధానికి సీఎం రేవంత్ చేసిన వినతులు**

- కేంద్ర ప్రభుత్వ నిర్దేశిత వికసిత్ భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా, తనవంతుగా తెలంగాణ దేశ ఆర్థిక ప్రగతిలో తోడ్పాటును అందించాలన్న సంకల్పంతో తెలంగాణ రైజింగ్ 2047 దార్శనిక పత్రం రూపొందించినట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవడంలో 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగాలని సమగ్రమైన ప్రణాళికలతో రోడ్ మ్యాప్‌ను రూపొందించినట్టు చెప్పారు.
- వివిధ రంగాల్లో నిష్ణాతులు, నిపుణులు, నీతి ఆయోగ్ సలహా సూచనలను క్రోడీకరించి మేధోమథనం అనంతరం విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించినట్టు చెప్పారు.
- తెలంగాణ రైజింగ్ లక్ష్యాలకు అనుగుణంగా ఫలితాలు సాధించడంలో, అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం తగిన సహాయ సహకారాలు అందించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రధానమంత్రి ని కోరారు.
- హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణకు అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని కోరారు. మొత్తం 162.5 కిలోమీటర్ల పొడవునా విస్తరించే ప్రతిపాదనలను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సమర్పించిందని, రూ.43,848 వేల కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్గా చేపట్టేందుకు ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు.
- హైదరాబాద్ రీజనల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగానికి కేబినేట్ ఆమోదంతో పాటు ఆర్థిక పరమైన అనుమతులు, అలాగే దక్షిణ భాగం నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరారు.
- రీజనల్ రింగ్ రోడ్డు వెంట ప్రతిపాదనల్లో ఉన్న రీజనల్ రింగ్ రైలు ప్రాజెక్టును వీలైనంత తొందరగా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.
- హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా మచిలీపట్నం పోర్ట్ వరకు 12 లేన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, హైదరాబాద్ నుంచి బెంగుళూరు హై స్పీడ్ కారిడార్‌ను అభివృద్ధి చేసేందుకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం చేపట్టేలా కేంద్రం ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.
- హైదరాబాద్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి నిరంతరాయంగా రవాణా సదుపాయం ఉండేలా టైగర్ రిజర్వ్ మీదుగా మన్ననూర్ నుంచి శ్రీశైలం వరకు నాలుగు వరుసల ఎలివేటేడ్ కారిడార్ నిర్మాణ ప్రతిపాదనలను ఆమోదించాలని కోరుతూ వినతిపత్రం అందించారు.

# పదేళ్లు నేనే సీఎం

(మొదటిపేజీ తరువాయి)

బుధవారం ప్రధాని మోదీతో భేటీ అనంతరం సీఎం రేవంత్ ఢిల్లీ మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ నిర్వహించారు. ఉత్తర భారతదేశంలో బీజేపీ తనను పాపులర్ చేస్తున్నందుకు సంతోషంగా ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులను ఆయన కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో పదేళ్లపాటు కాంగ్రెస్ ప్రభుత్వం తన నేతృత్వంలో కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. నిన్న డీసీసీ అధ్యక్షుల సమావేశంలో తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ సమాజం వంటిదే కాంగ్రెస్ పార్టీ అని అంతర్గతంగా జరిగిన కార్యక్రమంలో తాను పేర్కొన్నానని ఆయన అన్నారు. పార్టీ నేతగా ఎలా పని చేయాలనే అంశాన్ని వివరిస్తున్న క్రమంలో తాను చేసిన వ్యాఖ్యలపై విమర్శలు చేయడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ డిపాజిట్ కోల్పోయిందని, ఆ ఆవేదనతోనే తన వ్యాఖ్యలను వివాదాస్పదం చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో అంతర్గతంగా మాట్లాడిన అంశాలను ఎడిట్ చేసి ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

# అప్పులు తీర్చడం తమ్ముడి ఉపాయం

**అన్న పేరు మీద రూ.4 కోట్లకు బీమా చేయించి ఆపై దారుణంగా హత్య చేసిన వైనం**



**కరీంనగర్, మహా :** కరీంనగర్‌లో దారుణం వెలుగులోకి వచ్చింది. అప్పుల బాధ నుంచి బయటపడటం కోసం సొంత అన్న పేరు మీద బీమా చేయించి ఆపై హత్య చేశాడు ఒక తమ్ముడు. తన పథకంలో భాగంగా మానసిక వికలాంగుడైన అన్న పేరు మీద వివిధ బీమా కంపెనీల్లో రూ.4 కోట్లకు పైనే బీమా చేయించాడు. ఆ తర్వాత పథకం ప్రకారం మరో ఇద్దరితో కలిసి అన్నను హత్య చేసి ప్రమాదంగా చిత్రీకరించాడు. కానీ చివరకు బీమా అధికారులకు అనుమానం రావడంతో అసలు నిజం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా, రామడుగుకు చెందిన మామిడి నరేశ్(30) అనే వ్యక్తి మూడు సంవత్సరాల క్రితం రెండు టిప్పర్లను కొనుగోలు చేశాడు. వాటిని అద్దెకు ఇస్తూ.. వచ్చిన ఆదాయంతో జీవనం సాగించేవాడు. కొన్నాళ్ల పాటు అతడి వ్యాపారం బాగానే సాగింది. అయితే గతకొన్ని నెలలుగా వ్యాపారం సరిగ్గా నడవక ఈఎంఐలు కట్టేందుకు ఇబ్బంది పడ్డాడు. తెలిసిన వారి దగ్గర, దొరికిన ప్రతి చోటా అప్పులు చేశాడు. వీటికి తోడు స్టాక్ మార్కెట్‌లోనూ కొంత పెట్టుబడి పెట్టి నష్టపోయాడు. అలా మొత్తం కోటిన్నర రూపాయల మేర అప్పులయ్యాయి. మరోవైపు తమ డబ్బులు చెల్లించాల్సిందిగా అప్పు ఇచ్చిన వాళ్లు అడగడం మొదలు పెట్టారు. చేతిలో అంత మొత్తం లేదు. ఏం చేయాలా అని ఆలోచిస్తుండగా.. మానసికంగా సరిగా ఎదకక ఇంట్లోనే ఉంటున్న అన్న వెంకటేష్ (37) మీద అతడి కన్ను పడింది. అన్న పేరు మీద బీమా చేయించి ఆపై అతడిని చంపి అప్పులు తీర్చుకోవాలని భావించాడు. పథకంలో భాగంగా ముందుగా వెంకటేష్ పేరు మీద 4 ప్రైవేటు బీమా కంపెనీలతోపాటు ప్రభుత్వ బీమా సంస్థల నుంచి కూడా వేర్వేరుగా సుమారు రూ. 4.14 కోటు బీమా చేయించాడు. ఇదిలా ఉండగా నముండ్ల రాకేశ్ (28) అనే వ్యక్తి తనకు ఇవ్వాల్సిన రూ.7 లక్షల కోసం నరేశ్‌పై ఒత్తిడి తెచ్చాడు. దాంతో నరేష్ అన్నను చంపి అప్పులు తీర్చుకోవాలనుకుంటున్న తన ప్లాన్ గురించి రాకేశ్‌కు చెప్పాడు. పథకంలో తనకు సహకరిస్తే రాకేశ్‌కు ఇవ్వాల్సిన రూ. 7 లక్షలకు అదనంగా రూ. 13 లక్షలు ఇస్తానని చెప్పి.. ఒప్పించాడు. అలానే అతడి వద్ద టిప్పర్ డ్రైవర్‌గా పని చేసే ప్రదీప్‌కు రూ.2 లక్షలు ఇస్తానని ఒప్పించి తమతో కలుపుకున్నాడు. ఒకవేళ తమ ప్లాన్ గురించి బయట పడితే అందరు శిక్షను భరించాలని నరేష్, రాకేశ్, ప్రదీప్ ముగ్గురూ కనపడే విధంగా ఒప్పందం చేసుకుని దాన్ని వీడియో కూడా తీసుకున్నారు. తమ ప్లాన్‌లో భాగంగా నవంబర్ 29 న రాత్రి సమయంలో డ్రైవర్ ప్రదీప్ యజమాని నరేష్‌కు కాల్ చేసి ఊరి దగ్గర టిప్పర్ ఆగిపోయిందని తెలిపాడు. ఇది విన్న నరేష్ తన అల్లుడు సాయి బైక్‌పై అన్న వెంకటేశ్‌ను టిప్పర్ వద్దకు పంపించాడు. నరేశ్ కూడా వెనకాలే వెళ్లాడు. ఆ తర్వాత టిప్పర్ చక్రం కింద జాకీ పెట్టాలని చెప్పి వెంకటేశ్‌ని కింద పడుకోబెట్టి ఆపై నరేశ్ టిప్పర్‌ను నడుపుతూ ముందుకు కదిలించాడు. దీంతో వెంకటేశ్ టైర్ల కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు.

ప్రమాదవశాత్తు వెంకటేష్ చనిపోయినట్లు పోలీసులకు తెలిపాడు. వెంకటేష్ చనిపోయాడని తెలుసుకున్న బీమా కంపెనీల ప్రతినిధులు నవంబర్ 30న విచారణకు వచ్చారు. అయితే నరేశ్ చెప్పిన విధానంపై వారికి అనుమానం వచ్చింది. దీని గురించి పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దాంతో పూర్తిస్థాయిలో విచారణ చేయగా హత్య చేసినట్లు తేలడంతో నరేశ్‌తోపాటు రాకేశ్, ప్రదీప్‌లను అరెస్ట్ చేశారు. భీమా సొమ్ము కోసం అన్నను చంపిన తమ్ముడి వైనం తెలుసుకున్న గ్రామస్థులు, చుట్టుపక్కల గ్రామాల వారు మారుతున్న మనుషులు, స్వార్థం ఎంతకు దారి తీసిందో అని చర్చించుకుంటున్నారు.


## ప్రపంచ వాణిజ్యానికి
# అమెరికా బ్రేక్

**30 దేశాలపై డొనాల్డ్ ట్రంప్ సుంకాల ఉక్కుపాదం!**

**ఈయు, మెక్సికోతో సహా 30 దేశాలపై 30% సుంకాలు**

**వాణిజ్య వివాదాలకు కొత్త దారి, మిత్రదేశాల నుంచి ప్రతీకారం తప్పదా?**

**న్యూ ఢిల్లీ, మహా:** అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు షాకిస్తూ, సుమారు 30 దేశాల నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే వస్తువులపై భారీ సుంకాలను విధించారు. తనదైన శైలిలో 'అమెరికా ఫస్ట్' విధానాన్ని పునరుద్ఘాటిస్తూ, యూరోపియన్ యూనియన్ లోని కీలక సభ్య దేశాలు, అలాగే పొరుగుదేశమైన మెక్సికోను లక్ష్యంగా చేసుకుని ఈ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఆగస్టు 1 నుంచి అమల్లోకి రానున్న ఈ 30 శాతం సుంకాలు అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలలో పెను తుఫాను సృష్టించే అవకాశం ఉంది. ఈ చర్య యొక్క ప్రధాన ఉద్దేశం అమెరికాలో ఉపాధిని పరిరక్షించడం, దేశీయ పరిశ్రమలకు రక్షణ కల్పించడం అని ట్రంప్ కార్యాలయం స్పష్టం చేసింది. ఇతర దేశాలు అమెరికన్ ఉత్పత్తులపై అనుసరిస్తున్న అన్యాయమైన వాణిజ్య పద్ధతులకు ఇది సరైన జవాబు అని ఆయన సమర్థించుకున్నారు. అయినప్పటికీ, ఆర్థిక విశ్లేషకులు ఈ నిర్ణయం ప్రపంచ సరఫరా గొలుసులను దెబ్బతీస్తుందని, అమెరికన్ వినియోగదారులపై ద్రవ్యోల్బణ భారాన్ని పెంచుతుందని హెచ్చరిస్తున్నారు. ట్రంప్ తీసుకున్న ఈ ఏకపక్ష నిర్ణయంపై ప్రభావిత దేశాలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా యూరోపియన్ యూనియన్, దీనిని వాణిజ్య యుద్ధంగా అభివర్ణించింది, ప్రతీకారంగా అమెరికన్ ఎగుమతులపై సుంకాలు విధించడానికి సిద్ధమవుతోంది. ఈ ప్రతీకార చర్యలు అమెరికా వ్యవసాయ రంగం, తయారీదారులను తీవ్రంగా దెబ్బతీయగలవు.




ఇటువంటి చర్యలు ప్రపంచ వాణిజ్య సంస్థ యొక్క బహుపాక్షిక వ్యవస్థను బలహీనపరుస్తాయని, దేశాల మధ్య సహకారాన్ని దెబ్బతీస్తాయని దౌత్యవేత్తలు ఆందోళన చెందుతున్నారు. మిత్ర దేశాలైన మెక్సికో, ఇ యూ లపైనే ఆర్థిక దాడి చేయడం ద్వారా, ట్రంప్ తన విదేశాంగ విధానంలో దౌత్యానికి, వ్యూహాత్మక భాగస్వామ్యాలకంటే ఆర్థిక జాతీయవాదానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని స్పష్టమవుతోంది. ఇది కేవలం సుంకాల వివాదం కాకుండా, భద్రత, వలసలు వంటి కీలక అంశాలలో అంతర్జాతీయ సహకారంపై దీర్ఘకాలిక ప్రభావం చూపగల ఒక వ్యూహాత్మక చర్యగా అంతర్జాతీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఈ కొత్త వాణిజ్య యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ఏ దిశగా నడిపిస్తుందో చూడటానికి ప్రపంచ దేశాలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి.

# పెన్షన్ రివిజన్‌పై ఊహాగానాలకు తెర

- 8వ వేతన సంఘంలో సవరణపై కేంద్రం స్పష్టత!
- అనుమానాలకు తెరదించిన పార్లమెంటు వేదిక!

**న్యూ ఢిల్లీ, మహా:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన పెన్షనర్లకు సుదీర్ఘకాలంగా నెలకొన్న ఒక ముఖ్యమైన అంశంపై ఎట్టకేలకు స్పష్టత లభించింది. ఎనిమిదో వేతన సంఘం విధివిధానాల పరిధిలోకి పెన్షన్ సవరణ అంశం వస్తుందా లేదా అనే విషయంలో అనేక వార్తలు, ఊహాగానాలు చక్కర్లు కొట్టాయి. ఈ విషయంలో నెలకొన్న అనిశ్చితికి తెరదించుతూ, పార్లమెంట్ వేదికగా కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి ఈ విషయంలో స్పష్టమైన వివరణ ఇచ్చి, పెన్షనర్ల వర్గంలో భారీ ఊరట నింపారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, అలవెన్సులు, పెన్షనర్ల పింఛన్ సవరణలకు సంబంధించి సిఫార్సులు చేసేందుకు నియమించబడే ఎనిమిదో వేతన సంఘంపై గత కొన్ని రోజులుగా పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా, 8వ వేతన సంఘం పరిధిలో పెన్షన్ రివిజన్ అంశాన్ని చేర్చలేదనే ప్రచారం జరిగింది. దీనిపై పెన్షనర్ల సంఘాలు మరియు వివిధ ఉద్యోగ యూనియన్లు ఆందోళన వ్యక్తం చేస్తూ, పెన్షన్ సవరణను తప్పనిసరిగా చేర్చాలని ప్రధానమంత్రి, ఆర్థిక మంత్రితో సహా ఉన్నతాధికారులకు లేఖలు కూడా రాశాయి. ఈ నేపథ్యంలో, డిసెంబర్ 2న రాజ్యసభలో ఎంపీలు జావేద్ అలీ ఖాన్, రామ్‌జీ లాల్ సుమన్ అడిగిన ప్రశ్నలకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరీ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 8వ వేతన సంఘం అన్ని సంబంధిత అంశాలను పరిగణనలోకి తీసుకుంటుందని, ఇందులో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, భత్యాలతో పాటు పెన్షన్ సవరణ కూడా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రకటనతో పెన్షనర్లలో నెలకొన్న ఆందోళన పూర్తిగా తొలగిపోయింది. అయితే, తక్షణ ఉపశమనం కోసం ప్రస్తుత డియర్‌నెస్ అలవెన్స్ డియర్‌నెస్ రిలీఫ్ ను బేసిక్ పేలో విలీనం చేసే ప్రతిపాదన ఏమైనా ఉందా అని ఎంపీలు ప్రశ్నించగా, ప్రస్తుతం అలాంటి ప్రతిపాదన ఏదీ కేంద్ర ప్రభుత్వం పరిశీలనలో లేదని మంత్రి తెలిపారు. సాధారణంగా కరువు భత్యం 50 శాతానికి మించినప్పుడు దానిని బేసిక్ పేలో విలీనం చేస్తారనే విషయం తెలిసిందే. 2024 జనవరిలోనే డీఏ 50 శాతం దాటడంతో ఉద్యోగ సంఘాలు విలీనం కోసం డిమాండ్ చేశాయి. ఈ ప్రకటనతో, పెన్షనర్లు మరియు ఉద్యోగులు ఇప్పుడు 8వ వేతన సంఘం సిఫార్సుల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సిఫార్సులు 2026 జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.

# హిందువులపై కాంగ్రెస్ విషం చిమ్ముతోంది

- హిందూ సమాజమంతా సీఎం వ్యాఖ్యలపై స్పందించాలి
- కాంగ్రెస్ పార్టీ తగిన మూల్యం చెల్లించక తప్పదు
- మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ




**మహబూబ్ నగర్, మహా :** హిందూ దేవుళ్లను అవమానిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆయన అహంకారానికి నిదర్శనమని మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ మండిపడ్డారు. ఎన్నికలకు ముందు తానే గొప్ప హిందువునంటూ మాట్లాడిన రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే హిందువుల మనోభావాలను అవహేళన చేయడం సిగ్గు చేటన్నారు. కేసీఆర్ మాదిరిగానే రేవంత్ రెడ్డి సైతం పబ్లిసిటీ కోసం హిందూ దేవుళ్లపై నోరు పారేసుకోవడం శోచనీయమన్నారు. సర్వేజనా సుఖినోభవంతు. అందరూ బాగుండాలని కోరుకునేదే హిందూ సనాతన ధర్మమన్నారు. అందులో భాగంగానే ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్ నినాదంతో ప్రతి ఒక్కరికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నరనరాల్లోనూ హిందూ ద్వేషం నింపుకుందన్నారు. హిందువుల పట్ల, హిందూ సనాతన ధర్మం పట్ల విషం చిమ్ముతోందని విరుచుకుపడ్డారు. దేవుళ్లు, దేవాలయాలు తిండిపెడతాయా? కొలువులిస్తాయా? అంటూ గతంలో కాంగ్రెస్ నేత శ్యాంపిట్రోడా హిందూ ధర్మాన్ని హేళన చేస్తే, నేడు రేవంత్ రెడ్డి సైతం తాగుబోతులకు ఒక దేవుడు, మాంసాహారులకు ఒక దేవుడు ఉన్నాడంటూ అవమానించి సనాతన హిందూ ధర్మాన్ని చులకన చేస్తున్నారన్నారు. హిందూ సమాజమంతా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందించాలన్నారు. సీఎం చేసిన అహంకార పూరిత వ్యాఖ్యలకు కాంగ్రెస్ పార్టీ తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. హిందువుల ఓట్లతో గెలిచి హిందువులనే అవమానించేలా మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హిందూ సమాజమంతా తగిన బుద్ధి చెప్పే రోజులు త్వరలోనే రాబోతున్నాయని హెచ్చరించారు.

# తెలంగాణలో దేశంలోనే తొలి మహిళా ఫుట్‌బాల్ అకాడమీ

**మహా:** పలు రంగాల్లో రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం కోసం తెలంగాణ ప్రభుత్వం.. భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 8,9న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఈ సమ్మిట్ కు ప్రపంచం నలుమూలల నుంచి కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులు, పెట్టుబడిదారులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా పలు సంస్థలు ఎంవోయూలు కుదుర్చుకుంటాయని భావిస్తున్నారు. అలానే ఈ సమ్మిట్ వేదికగా క్రీడారంగానికి సంబంధించి కీలక ముందడుగు పడనుంది. దేశంలోనే తొలి మహిళా ఫుట్ బాల్ అకాడమీని రాష్ట్రంలో ఏర్పాటు చేయబోతున్నారు. హాంకాంగ్ తర్వాత ప్రపంచంలో రెండో మహిళల ఫుట్ బాల్ అకాడమీ ఇదే కావడం విశేషం. దీంతో పాటు దేశంలో రెండో మెన్స్ ఫుట్‌బాల్ అకాడమీని కూడా రాష్ట్రంలోనే ఏర్పాటు చేయాలని రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. ఫ్యూచర్ సిటీలో జరిగే సదస్సులో దీనికి సంబంధించిన వివరాలను ప్రకటించనున్నారు. వీటితో పాటు భాగ్యనగరంలో అంతర్జాతీయ చెస్ నిర్వహణకు సంబంధించిన ప్రకటన కూడా వెలువడనుంది. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా ఈ అకాడమీ ఏర్పాటుపై తెలంగాణ ఫిఫా ఏఐఎఫ్‌ఎఫ్ (ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్) సంయుక్తంగా ప్రకటన చేయనున్నాయి. ఈ సమ్మిట్‌లో భాగంగానే దేశంలో రెండో పురుషుల ఫుట్‌బాల్ అకాడమీని కూడా తెలంగాణలోనే ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించబోతున్నారు. అలాగే హైదరాబాద్‌లో అంతర్జాతీయ చెస్ పోటీల నిర్వహణపై కూడా ప్రకటన వెలువడనుంది. డిసెంబర్ 8, 9 తేదీల్లో.. భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు దేశంలోని వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నారు. దీనిలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులకు వివిధ రాష్ట్రాల సీఎంలను స్వయంగా కలిసి ఆహ్వానించే బాధ్యతలను అప్పగించారు. ఈక్రమంలో డిసెంబర్ 4న మంత్రులు ఆయా రాష్ట్రాలకు వెళ్లి.. ఆహ్వాన లేఖలు అందిస్తారు. ఢిల్లీ వెళ్ళిన సీఎం ప్రధాన మంత్రితో సహా పలువురు కేంద్ర మంత్రులకు ఆహ్వానాలను అందించారు. మిగతా వారికి తెలంగాణ ఎంపీలు ఆహ్వాన లేఖలు అందజేయనున్నారు. ఈ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరయ్యే ప్రముఖులు, అతిథులకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక బహుమతులతో కూడిన బాస్కెట్లను అందజేయనుంది. ఈ సమిట్‌కు హాజరయ్యేందుకు హైదరాబాద్ విచ్చేస్తున్న అతిథులకు ప్రభుత్వం తరపున ప్రత్యేక స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీరు నగరంలో అడుగు పెట్టగానే వారికి ఎప్పటికీ గుర్తుండిపోయేలా స్వాగత సత్కారాలు చేసి ఒక బాస్కెట్‌ను అందిస్తారు. ఈ బాస్కెట్ లో సమ్మిట్ లోగోతో కూడిన సావనీర్, హైదరాబాద్ అత్తర్, ముత్యాలతో చేసిన ఆభరణాలు, పోచంపల్లి శాలువా, చేర్యాల మాస్క్ (పెయింటింగ్స్) ఉంటాయి. వీటితో పాటు అప్పాలు, సకినాలు, మహువా లడ్డూలు, బాదామ్ కీ జాలి వంటి తెలంగాణ సంప్రదాయ వంటకాలు కూడా ఉండేలా సిద్ధం చేస్తున్నారు.

# ఫాల్కాన్ గ్రూప్ స్కాం




- విమానం అమ్మేసేందుకు సిద్ధమైన ఈడీ
- వచ్చిన డబ్బులను బాధితులకు పంచాలని నిర్ణయం

**హైదరాబాద్, మహా :** ఫాల్కన్ గ్రూప్ పెట్టుబడుల మోసానికి సంబంధించిన భారీ కుంభకోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కీలక అడుగు వేసింది. నిందితుడికి చెందిన సీజ్ చేసిన 'హాకర్ 800' విమానాన్ని వేలం వేయడానికి ఈడీ సన్నాహాలు చేస్తోంది. ఈ విమానం వేలం డిసెంబర్ 9న ఎంఎస్‌టీసీ లిమిటెడ్ ద్వారా బేగంపేట విమానాశ్రయంలో జరగనుంది. వేలం ద్వారా వచ్చే మొత్తాన్ని భారీ పెట్టుబడుల మోసంలో నష్టపోయిన బాధితులకు పరిహారంగా చెల్లించడానికి ఈడీ నిర్ణయం తీసుకుంది.

**కేసు నేపథ్యం ఇది**

ఫాల్కాన్ గ్రూపునకు చెందిన క్యాపిటల్ ప్రొటెక్షన్ అనే సంస్థ ఇన్వాయిస్ డిస్కౌంట్ పథకం పేరుతో ప్రజలను పెద్ద ఎత్తున మోసం చేసింది. ఈ పథకం ద్వారా అమాయక ప్రజల నుంచి భారీ మొత్తంలో డబ్బు వసూలు చేసి, నిధులను దుర్వినియోగం చేశారు. బాధితుల ఫిర్యాదుల మేరకు సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం ఈ ఏడాది ఫిబ్రవరిలో ఫాల్కన్ గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అయిన అమర్‌దీప్ కుమార్‌పై కేసులు నమోదు చేసింది. ప్రాథమిక దర్యాప్తులో ఫాల్కాన్ గ్రూపు మొత్తం రూ.792 కోట్ల మేర మోసానికి పాల్పడినట్లు తేలింది. ఈ భారీ మోసం, నిధుల మళ్లింపుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగి, మనీ లాండరింగ్ కింద మరో కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలు పెట్టింది. మోసం ద్వారా ప్రజల నుంచి కొల్లగొట్టిన డబ్బుతో అమర్‌దీప్ కుమార్ పెద్దఎత్తున ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తించారు. ఈ ఆస్తుల్లో ఒక విమానం కూడా ఉంది. తనపై కేసులు నమోదు కాగానే అమర్‌దీప్ కుమార్ తాను కొనుగోలు చేసిన ఆ విమానంలోనే దేశం విడిచి విదేశాలకు పారిపోయాడు, ప్రస్తుతం అతడు పరారీలో ఉన్నాడు. అయితే విదేశాలకు పారిపోయిన తర్వాత తన విమానాన్ని అద్దెకు ఇచ్చాడు. అది శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రాగా ఈడీ అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. హ్యాంగర్ ఛార్జీలు తగ్గించడానికి దీనిని తర్వాత బేగంపేటకు తరలించారు. విమానం సీజ్ చేసిన తర్వాత ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద అడ్జుడికేటింగ్ అథారిటీకి దరఖాస్తు చేయగా ఈ ఏడాది ఆగస్టులో అది విమానం అటాచ్‌మెంట్‌ను ధృవీకరించింది. ఈడీ దరఖాస్తును అడ్జుడికేటింగ్ అథారిటీ నవంబర్ 20న ఆమోదించడంతో.. హైదరాబాద్ జోనల్ ఆఫీస్ వేలాన్ని నిర్వహించడానికి మార్గం సుగమమైంది. విమానం వేలం ద్వారా లభించిన నిధులను మోసపోయిన అమాయక ప్రజలకు అందించేందుకు ఈడీ ప్రయత్నిస్తోంది.

# పీచుపల్లిలో సర్పంచ్ పదవి ఏకగ్రీవం

**బీజేపీ బలపర్చిన అభ్యర్థి రాజిరెడ్డి ఒక్కరే నామినేషన్**

**గ్రామాభివృద్ధికి రూ.10 లక్షల నిధులు కేటాయిస్తానన్న కేంద్ర మంత్రి బండి సంజయ్**

**బీజేపీ అభ్యర్థులను ఏకగ్రీవం చేస్తే గ్రామాభివృద్ధి కోసం నిధులు తెస్తానని హామీ**


**కరీంనగర్, మహా :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రెండో విడత నామినేషన్ల దాఖల పర్వం పూర్తయింది. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం పీచుపల్లి గ్రామంలో సర్పంచ్ పదవికి బీజేపీ బలపర్చిన సామ రాజిరెడ్డి ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ల గడువు కూడా ముగియడంతో సామ రాజిరెడ్డి ఎన్నిక ఏకగ్రీవం లాంఛనమే కానుంది. సర్పంచ్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ బలపర్చిన అభ్యర్థులను ఏకగ్రీవం చేస్తే ఆ గ్రామాలకు రూ.10 లక్షల చొప్పున ప్రోత్సాహక నిధులను కేటాయిస్తానని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రకటించిన విషయం తెలిసిందే. జిల్లాలో బీజేపీ పక్షాన తొలి ఏకగ్రీవం కావడంతో ఇచ్చిన మాట మేరకు ఆయా నిధులను అందజేస్తానని బండి సంజయ్ తెలిపారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం సైతం ఎన్నికల్లేకుండా సర్పంచ్ అభ్యర్థులు ఏకగ్రీవం అయ్యే గ్రామాలకు రూ.10 లక్షల చొప్పున ప్రోత్సాహక నిధులిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ లెక్కన పీచుపల్లి మొత్తం రూ.20 లక్షల ప్రోత్సాహక నిధులు అందనున్నాయి. ఈ నిధులను తమ గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటామని ఆయా గ్రామస్తులు చెబుతున్నారు. ఈ మేరకు గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.




# అలాంటి భావోద్వేగం తెలుగు సినిమాకే సొంతం: రామ్ పోతినేని

''ఇప్పటి వరకు ఎన్నో సినిమాల్లో మనం చాలా ఎమోషన్స్ చూశాం. కానీ, ఓ స్టార్ హీరో, ఫ్యాన్‌కి మధ్య ఉన్న భావోద్వేగాన్ని చెబుతూ, హ్యూమన్ ఎమోషన్‌ని కూడా టచ్ చేసిన సినిమా 'ఆంధ్ర కింగ్ తాలూకా'. ఇలాంటి భావోద్వేగం ప్రపంచంలో ఎక్కడా లేదు... మన తెలుగు సినిమాకే సొంతం. మనం సినిమా లవర్స్... మంచి సినిమాకి గుర్తింపు వస్తూనే ఉంటుంది'' అన్నారు రామ్ పోతినేని. మహేశ్‌బాబు పి. దర్శకత్వంలో రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'. ఉపేంద్ర కీలక పాత్ర పోషించారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం నవంబరు 27న విడుదలైంది. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన థ్యాంక్స్ మీట్‌లో వై. రవిశంకర్ మాట్లాడుతూ- ''మా సినిమాకి ప్రశంసలతో పోల్చుకుంటే వసూళ్లు కాస్త తక్కువగానే ఉన్నాయి. నెక్ట్స్ వీక్ అద్భుతమైన రన్ ఉంటుందని నమ్ముతున్నాం. నేటి నుంచి థియేటర్స్‌ని విజిట్ చేసి, ఫ్యాన్స్‌ని కలుసుకుంటాం'' అని తెలిపారు. ''ఈ చిత్రంలో మహాలక్ష్మిలాంటి మంచి పాత్ర చేసినందుకు గర్వంగా ఉంది'' అన్నారు భాగ్యశ్రీ. ''ఇక్కడి నుంచి మా సినిమా చాలా లాంగ్ వెళ్లబోతోంది'' అని మహేశ్‌బాబు పి. పేర్కొన్నారు. మ్యూజిక్ డైరెక్టర్స్ వివేక్, మెర్విన్ మాట్లాడారు.

# రాజాసాబ్ నిడివి ఎక్కువే..






ప్రభాస్ 'రాజాసాబ్' రిలీజ్ టైమ్ ఫిక్స్ అయింది. లెక్క ప్రకారం ఈ వారమే థియేటర్లలోకి రావాలి. కానీ సంక్రాంతికి రావాలని నిర్ణయించుకుని.. విడుదల తేదీని జనవరి 9కి మార్చారు. ఇప్పటికే ఓ ట్రైలర్ రాగా బాగానే రెస్పాన్స్ వచ్చింది. కానీ కొన్నిరోజుల క్రితం రిలీజైన తొలి పాట మాత్రం ఏ మాత్రం ఆకట్టుకోలేకపోయింది. సరే ఇవన్నీ పక్కనబెడితే తాజాగా యూఎస్ బుకింగ్స్ ఓపెన్ కావడంతో ఓ విషయంలో ఫ్యాన్స్‌కి క్లారిటీ వచ్చేసింది. 'రాజాసాబ్' ఓవర్సీస్‌కి సంబంధించిన టికెట్లని తాజాగా ఆన్‌లైన్‌లో పెట్టేశారు. ఈ క్రమంలోనే మూవీ రన్ టైమ్ ఎంతో బయటపడింది. 3 గంటల 10 నిమిషాల నిడివితో సినిమా రాబోతుందని క్లారిటీ వచ్చింది. గతంలో మూడున్నర గంటలకు పైనే ఉండొచ్చని అన్నారు. ఇప్పుడు ఫైనల్‌గా ఈ టైమ్‌కి ఫిక్సయ్యారనమాట. గత కొన్నేళ్లలో అర్జున్ రెడ్డి, పుష్ప 2, యానిమల్ తదితర చిత్రాలు 3 గంటలకు పైగా రన్ టైమ్‌తోనే థియేటర్లలోకి వచ్చాయి. ప్రేక్షకుల్ని అలరించాయి. అవన్నీ డిఫరెంట్ జానర్స్. 'రాజాసాబ్' కూడా 3 గంటలకు పైనే ఉన్న పెద్ద మూవీ. కంటెంట్ పరంగా మెప్పిస్తే పర్లేదు లేదంటే మాత్రం చూసే ప్రేక్షకులు ఇబ్బంది పడే అవకాశముంది. ఈ ఒక్క విషయంలో మాత్రం కాస్త టెన్షన్. మరి 3 గంటల పాటు టీమ్ ఏ రేంజులో మెప్పిస్తారో తెలియాలంటే మరో నెల ఆగాల్సిందే. 'రాజాసాబ్'లో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా చేశారు. తమన్ సంగీతమందించగా.. మారుతి దర్శకత్వం వహించారు. హారర్ ఫాంటసీ కామెడీ కథతో దీన్ని తెరకెక్కించారు. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ భారీ బడ్జెట్ పెట్టింది. సంక్రాంతి బరిలో తొలుత రాబోతున్న సినిమా ఇదే. తర్వాత మిగతా చిత్రాలు థియేటర్లలోకి వస్తాయి.

# అలాంటి వారిని కఠినంగా శిక్షించాలి: రష్మిక..!

టెక్నాలజీ వచ్చాక ప్రతి పని మరింత సులభతరమైపోయింది. ఇప్పుడు మనం పూర్తిస్థాయి డిజిటల్ ఇండియాగా మారిపోయాం. దీంతో సాంకేతికత పెరిగే కొద్ది సవాళ్లు కూడా అదే స్థాయిలో రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. టెక్నాలజీ ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో.. అంతే వేగంగా సమస్యలు కూడా తెచ్చిపెడుతోంది. ముఖ్యంగా ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్) వచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఉద్యోగాలపై ప్రభావం మాత్రమే కాదు.. వ్యక్తిగత గోప్యతకు కూడా సవాల్‌గా మారింది. సినీతారలు ఫోటోలను ఇష్టమొచ్చినట్లుగా ఏఐతో ఎడిట్ చేసి నెట్టింట పోస్ట్ చేస్తున్నారు. వీటిలో మంచికంటే ఎక్కువగా అసభ్యకరమైన కంటెంట్ ఉంటోంది. వీటి బారిన ఇప్పటికే పలువురు అగ్ర సినీతారలు పడ్డారు. ఏఐని మంచి పనుల కోసం ఉపయోగించాలి కానీ.. ఎక్కువ శాతం దుర్వినియోగం చేయడానికే మొగ్గు చూపుతున్నారు. అలా చాలామంది సినీతారల ఫోటోలను మార్ఫింగ్ చేసిన సోషల్ మీడియాలో ట్రెండింగ్ చేస్తున్నారు. ఇలా దుర్వినియోగానికి ఏఐని వాడుకోవడంపై రష్మిక మందన్నా రియాక్ట్ అయింది. ఏఐ అనే మన అభివృద్ధికి కోసమని.. అంతేకానీ అసభ్యతను సృష్టించడానికి కాదని ట్వీట్ చేసింది. మహిళలను లక్ష్యంగా చేసుకుని దుర్వినియోగానికి పాల్పడుతున్న కొంతమందికి నైతికత లేదని మండిపడింది. మనం నిజాన్ని సృష్టించినప్పుడు.. వివేచన అనేది గొప్ప రక్షణగా మారుతుందని పోస్ట్‌లో రాసుకొచ్చింది. రష్మిక తన ట్వీట్‌లో రాస్తూ..' ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోండి.. ఇంటర్నెట్ అనేది నిజానికి అద్దం లాంటిది కాదు.. అది ఏదైనా సృష్టించగలిగే ఓ కాన్వాస్. ఇకపై ఏఐ టెక్నాలజీని దుర్వినియోగానికి కాకుండా.. గౌరవప్రదమైన, ప్రగతిశీల సమాజాన్ని నిర్మించడానికి ఉపయోగించుకుందాం. ఇక్కడ మనం నిర్లక్ష్యం కంటే బాధ్యతగా వ్యవహరిద్దాం.. ప్రజలు మనుషుల్లా వ్యవహరించకపోతే.. అలాంటి వారికి కఠినమైన, క్షమించరాని శిక్షలు విధించాలి' అంటూ పోస్ట్ చేసింది. ఇది కాస్తా నెట్టింట వైరల్ కావడంతో కొందరు నెటిజన్స్ రష్మికకు మద్దతుగా పోస్టులు పెడుతున్నారు.





# అవతార్ 3 అడ్వాన్స్ బుకింగ్స్

యానిమేషన్ కథా చిత్రాలకు ప్రపంచస్థాయిలో స్ఫూర్తిదాయకుడు జేమ్స్ కామెరూన్. ఆయన 2009లో తెరకెక్కించిన అవతార్ చిత్రం ఒక అద్భుతం. ఈ మూవీ ప్రపంచ సినీ ప్రేక్షకులను కట్టి పడేసింది. ఆ తరువాత దానికి సిక్వెల్‌గా రూపొందిన అవతార్. ది వే ఆఫ్ వాటర్ చిత్రం 2022లో విడుదలై ప్రేక్షకులకు కనువిందు చేసింది. అప్పడే దర్శకుడు జేమ్స్ కామెరూన్ దీనికి ఫ్రాంచైజీ ఉందన్నారు. దీంతో ప్రేక్షకులు ఈ సారి ఎలాంటి వండర్ సృష్టిసారో అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆ ఎదురుచూపులకు ఫుల్‌స్టాప్ పడే రోజు వచ్చేసింది. అవతార్ మూడో పార్ట్‌గా అవతార్ ఫైర్ అండ్ యాష్ డిసెంబర్ 19వ తేదీన తెలుగు తమిళం, కన్నడం, మలయాళం, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో విడుదల కానుంది. దీన్ని 20 సెంచరీ స్టూడియో సంస్థ విడుదల చేస్తోంది. ఈ మూవీ గత రెండు చిత్రాల కంటే మరింత బ్రహ్మాండంగా తెరకెక్కించినట్లు యూనిట్ వర్గాలు పేర్కొన్నాయి. అదే విధంగా ఈసారి ఈ చిత్రం ప్రేక్షకులకు ఐమాక్స్ థియేటర్లో అనుభూతిని కలిగించబోతోంది. ఈ చిత్రం కోసం ప్రపంచవ్యాప్తంగా ఐమాక్స్ థియేటర్లు సిద్ధమవుతున్నాయి. ఈ చిత్రానికి డిసెంబర్ 5నుంచి అడ్వాన్స్ బుకింగ్ మొదలు కాబోతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



# ఆదిపురుష్ బ్యూటీ చెల్లికి సింగర్‌తో పెళ్లి?

సాధారణంగా హీరోయిన్లు త్వరగా పెళ్లి చేసుకోరు. ఒకవేళ వీళ్లకు చెల్లి లేదా తమ్ముడు ఉంటే వాళ్లకు ముందుగా వివాహం చేసేస్తారు. తర్వాత ఎప్పుడో టైమ్ చూసుకుని వీళ్లు కొత్త జీవితం ప్రారంభిస్తారు. గతంలో సాయిపల్లవి ఇలానే తనకంటే ముందు చెల్లి పెళ్లి చేసింది. ఇప్పుడు లిస్టులోకి మరో స్టార్ హీరోయిన్ చేరబోతున్నట్లు తెలుస్తోంది. మహేశ్ బాబు 'వన్ నేనొక్కడినే' సినిమాతో హీరోయిన్ అయిన కృతి సనన్.. తర్వాత 'దోచేయ్' అనే మరో తెలుగు మూవీ చేసింది. ఈ రెండు ఫ్లాప్ అయ్యేసరికి బాలీవుడ్‌కి వెళ్లిపోయింది. బాగానే పేరు తెచ్చుకుంది. ప్రస్తుతం అడపాదడపా మూవీస్ చేస్తూ బిజీగానే ఉంది. ఈమె చెల్లి నుపుర్ కూడా నటినే. గతంలో ఆల్బమ్ సాంగ్స్‌లో యాక్ట్ చేసింది. రవితేజ 'టైగర్ నాగేశ్వరరావు' మూవీతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. సినిమా ఫెయిలైంది. ఈమె యాక్టింగ్ కూడా తేలిపోవడంతో తెలుగులో మరో ఆఫర్ రాలేదు. ప్రస్తుతానికైతే హిందీలో ఓ చిత్రంలో నటిస్తోంది. అలాంటిది ఇప్పుడు నుపుర్ పెళ్లి చేసుకోనుందనే న్యూస్ బయటకొచ్చింది. రాజస్థాన్‌లోని ఉదయపుర్ వేదికగా ఈ డెస్టినేషన్ వెడ్డింగ్ జరగనుందని తెలుస్తోంది. సింగర్ స్టెబిన్ బెన్‌తోనే నుపుర్ కొత్త జీవితం ప్రారంభించనుందని టాక్. ఇప్పటికే ఏర్పాట్లు మొదలయ్యాయని.. జనవరి 8,9 తేదీల్లో ఈ శుభాకార్యం జరగనుందని సమాచారం. ఈ వివాహ వేడుకకు ఇరువురి కుటుంబ సభ్యులు, సన్నిహితులతో పాటు ఇండస్ట్రీకి చెందిన కొద్ది మంది మాత్రమే హాజరవుతారని తెలుస్తోంది. అయితే నుపుర్ లేదా స్టెబిన్ ఈ విషయం గురించి క్లారిటీ ఇవ్వాల్సి ఉంది.



# కథలు రాస్తున్నాను: కీర్తి సురేష్

నటిగా హీరోయిన్ కీర్తి సురేష్ సూపర్ సక్సెస్ అయ్యారు. కమర్షియల్ చిత్రాల్లో నటిస్తూ... సామాజిక అంశాలతో రూపొందే ఫిమేల్ ఓరియంటెడ్ చిత్రాల్లో విజృంభిస్తూ దూసుకెళుతున్నారు కీర్తి. ఈ నటిలో మరో కోణం కూడా ఉంది. అదే డైరెక్షన్. "భవిష్యత్తుతో నాకు దర్శకత్వం వహించే ఆలోచన ఉంది" అని కీర్తి చెబుతున్నారు. కీర్తి సురేష్ టైటిల్ రోల్‌లో నటించిన 'రివాల్వర్ రీటా' సినిమా గత నెల 28న విడుదలైంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా తనకు దర్శకత్వం వహించే ఆలోచన ఉందని కీర్తి సురేష్ చెప్పారు. "నాకు డైరెక్టర్‌ని కావాలని ఉంది. అందుకే టైమ్ దొరికినప్పుడు లేదా ఎక్కడికైనా ట్రావెల్ చేస్తున్నప్పుడు ఏవైనా స్టోరీ ఐడియాస్ వస్తే వాటిని నోట్ చేసుకుంటున్నాను. గత ఐదు సంవత్సరాలుగా ఈ పని చేస్తున్నాను. అంతేకాదు... నా దగ్గర ఉన్న స్టోరీ ఐడియాస్‌ను కొంతమంది అసిస్టెంట్ డైరెక్టర్స్‌తో షేర్ చేసుకుని, డెవలప్ చేయమని చెప్పాను.

అలాగే వాళ్ల స్టోరీస్, ఐడియాస్‌ను కూడా నేను వింటున్నాను" అని కీర్తి సురేష్ చెప్పుకొచ్చారు. కీర్తి మాటలను బట్టి చూస్తే ఆమె దర్శకురాలు కావాలని స్ట్రాంగ్‌గా నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది. మరి... కీర్తి సురేష్ దర్శకత్వంలో తొలి సినిమా ఎప్పుడు వస్తుంది? ఆమె ఏ తరహా కథలు రాసుకున్నారు? అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు. మరోవైపు ప్రస్తుతం విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న 'రౌడీ జనార్ధన' సినిమాతో కీర్తి సురేష్ నటిగా బిజీగా ఉన్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది విడుదల కానుంది.

# బాలీవుడ్‌లో అరడజను సినిమాలు

## క్లారిటీ ఇచ్చిన దిల్ రాజు



టాలీవుడ్ ప్రముఖ నిర్మాత దిల్ రాజు బాలీవుడ్‌పై ఫోకస్ పెట్టాడని, అక్కడ వరుసగా ఆరు సినిమాలు నిర్మించబోతున్నట్లు గత కొన్ని రోజులుగా వార్తలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై దిల్ రాజు క్లారిటీ ఇచ్చారు. ఎప్పుడో వచ్చిన పాత ఊహాగానాలకు, ఇప్పటి విషయాలకు ముడిపెడుతూ కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. వాటిని నమ్మొద్దని దిల్ రాజుకోరారు. 'శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నుండి రాబోయే సినిమాల గురించి ఈ మధ్య రకరకాల పుకార్లు వినిపిస్తున్నాయి. ఇవన్నీ పూర్తిగా నిరాధారమైనవని, వాటిలో నిజం లేదు. ప్రస్తుతం మేము అక్షయ్ కుమార్ హీరోగా, అనీస్ బాజ్మీ దర్శకత్వంలో ఒక సినిమాను ప్లాన్ చేస్తున్నాం. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రాథమిక పనులు జరుగుతున్నాయి. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి వివరాలను మేమే అధికారికంగా ప్రకటిస్తాం. అప్పటివరకూ ఈ రూమర్స్‌ను నమ్మొద్దు. అవాస్తవాలను ప్రచారం చేయొద్దని మీడియాను కోరుతున్నాను' అని దిల్ రాజు విజ్ఞప్తి చేశారు. కాగా, అక్షయ్ కుమార్‌తో దిల్ రాజు నిర్మించే సినిమా.. 'సంక్రాంతికి వస్తున్నాం' హిందీ రీమేక్ అని ప్రచారం జరుగుతుంది.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034